సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 3 । అక్టోబర్ । 2024



మహోద్యమంగా బతుకమ్మ
బహుజన బతుకమ్మ.. ఉత్సవం మాత్రమే కాదని, మహోద్యమం అని ప్రజా గాయకురాలు విమలక్క పేర్కొన్నారు.
- 10లో



అమావాస్య పూజలు
నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు.
- 10లో



పుస్తకావిష్కరణ
ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'ఏడు కోలలబాయి' పుస్తకావిష్కరణ సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది.
- 10లో





ఒక్కేసి పువ్వేసి చందమామ..

ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో బుధవారం బతుకమ్మ ఆడుతున్న మహిళలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో బతుకమ్మ..

న్యూస్‌రీల్

4న జిల్లా కోర్టులో మెగా హెల్త్ క్యాంప్

భువనగిరి క్రైం : ఎయిమ్స్ సహకారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన భువనగిరిలోని జిల్లా కోర్టులో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో క్యాన్సర్, కార్డియాలజీ, ఈఎన్‌టీ, కంటి నిపుణులు, జనరల్ మెడిసిన్‌తో కూడిన వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బందితో పాటు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన జడ్జి ఏ.జయరాజు, ఇతర న్యాయమూర్తులు మెడికల్ క్యాంప్‌కు హాజరకానున్నట్లు తెలిపారు.

భూగర్భ జలవనరుల శాఖ సహాయ అధికారిగా ఎంపిక



గడ్డమీది శ్రీకాంత్

ఆత్మకూరు(ఎం) : భూగర్భ జలవనరుల శాఖ రాష్ట్ర సహాయ అధికారిగా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రానికి చెందిన గడ్డమీది శ్రీకాంత్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన గద్వాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డమీది కనకయ్య మూడవ కుమారుడు శ్రీకాంత్ 5వ తరగతి వరకు స్థానికంగా, 6వ తరగతి నుంచి ఉన్నత చదువులు హైదరాబాద్‌లో పూర్తి చేశారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మికపర్వాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాతం సేవ, అర్చన, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో స్వామి, అమ్మవారి సేవను ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.


డీజేలకు అనుమతి లేదు

భువనగిరి క్రైం : రాచకొండ కమిషనరేట్ పరిధిలో మతపరమైన ఊరేగింపుల్లో డీజేలను నిషేధిస్తూ సీపీ సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజే సౌండ్ వల్ల గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వ్యక్తుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుందని, చిన్న పిల్లలకు శాశ్వత వినికిడి సమస్య రానుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు కమీషనరేట్ పరిధిలో జరిగే ఊరేగింపుల్లో డీజేలు, బాణాసంచాలు కాల్చడాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఉత్తర్వులు అమలు చేయాలని కమిషనరేట్ పరిధిలోని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇంకా కొరతే!

జిల్లాలో 736 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

- డీఎస్సీ-2024 ద్వారా భర్తీ కానున్నవి 277 పోస్టులు
- ఇంకా మిగిలి ఉండనున్న ఖాళీలు
- సింగిల్ టీచర్‌తో నడుస్తున్న పాఠశాలల్లో తీవ్రంగా సమస్య
- ఒక్కరే అన్ని సబ్జెక్టులు బోధించాల్సిన దుస్థితి
- ఆరోగ్య సమస్యలు తలెత్తినా విధులకు
- కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్తే ఆ రోజు పాఠాలు బంద్



భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరే పరిస్థితి కనిపించడం లేదు. రెండు నెలల క్రితం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసిన అనంతరం, పదవీ విరమణ పొందిన వారితో కలిపి జిల్లా వ్యాప్తంగా 736 ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. డీఎస్సీ-2024 ద్వారా 277 పోస్టులను భర్తీ చేసినా ఇంకా 459 ఖాళీలు మిగిలి ఉంటాయి. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఒకరు, ఇద్దరు టీచర్లతో నడుస్తున్న పాఠశాలల్లో చదువులు కుంటుపడే అవకాశం లేకపోలేదు. ఈ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులను అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.

ఒక్కరు 18 సబ్జెక్టుల బోధన

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 481 ప్రాథమిక, 63 ప్రాథమికోన్నత, 68 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సింగిల్ టీచర్‌తో నడుస్తున్న పాఠశాలలు 71 వరకు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1నుంచి 5వ తరగతి వరకు ఉన్నాయి. అన్ని తరగతుల్లో కలిపి విద్యార్థులు 20లోపే ఉన్నారు. వారందరికీ ఒక్కరే ఉపాధ్యాయుడు బోధన చేయాల్సి ఉంటుంది. ఇందులో 1,2 తరగతులకు 3 సబ్జెక్టులు, 3,4,5 తరగతులకు నాలుగు సబ్జెక్టుల చొప్పున ఉంటాయి. సింగిల్ టీచర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు కలిపి రోజూ 18 సబ్జెక్టులు బోధించాలి. ఒక తరగతిలో ఒక్కడే విద్యార్థి ఉన్నా అతనికి సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయుడు రాకపోతే పాఠాలు బందే..

సింగిల్ టీచర్స్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవు పెట్టలేని పరిస్థితి నెలకొంది. నెలకు రెండుసార్లు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయి. ఉపాధ్యాయుడు తప్పనిసరిగా సమావేశాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ రోజు విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు ఉండరు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన విధులు నిర్వహించాల్సి వచ్చినప్పుడు శిక్షణకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ సందర్భాల్లో విద్యార్థులకు బోధన ఉండదు. కొన్ని పాఠశాలల్లో ఉదయం ప్రార్థన కూడా చేయించడడందు. ముఖ్యంగా మహిళా టీచర్ ఉన్న పాఠశాలల్లో సమస్యలు అన్నీఇన్నీ కావు.

ఇప్పటికీ రిలీవ్ కాని 44 మంది సింగిల్ స్కూళ్ల టీచర్లు

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా సింగిల్ టీచర్‌తో నడుస్తున్న పాఠశాలల్లో సుమారు 40 మందికి బదిలీ అవకాశం లభించింది. కానీ, వారి స్థానాల్లోకి రావాల్సిన ఉపాధ్యాయులు ఎవ్వరూ రాకపోవడంతో ఇంకా రిలీవ్ కాలేదు. అదే పాఠశాలల్లో కొనసాగుతున్నారు. కాగా ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా జీఓ నంబర్ 25 ప్రకారం 1 నుంచి 10మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ దీన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

వలంటీర్లను నియమించాలి



ప్రాథమిక పాఠశాలల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. సింగిల్ టీచర్ ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు నష్టపోతున్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలకు వెళ్లడానికి ఆసక్తి చూపకపోవడంతో అక్కడ కొందరు ఉపాధ్యాయులు బదిలీ అయినా రిలీవ్ కాలేదు. సింగిల్ టీచర్ ఉన్న చోట విద్యా వలంటీర్లను నియమించాలి.

–ముక్కెర్ల యాదయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఒక్కరే 18 సబ్జెక్టులు బోధిస్తున్నారు



ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. సింగిల్ టీచర్‌తో నడుస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అనారోగ్య సమస్యలు వస్తే సెలవు పెట్టలేని పరిస్థితి ఉంటుంది. ఒక్కరే టీచర్ ఉండడం వల్ల 18 సబ్జెక్టులు బోధించడం భారంతో కూడుకున్న పని. అందుకే జీఓ నంబర్ 25ను సవరించి విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులను నియమించాలి.

–ధర్మారపు వెంకటయ్య, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బదిలీ అయినా అక్కడే విధులు



సుమారు 14 సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయుల బది లీలు జరిగాయి. సింగిల్ టీచర్‌తో నడుస్తున్న పాఠశాల్లోని ఉపాధ్యాయుల్లో చాలా మంది బదిలీ అయ్యారు. కానీ, ఆ స్థానంలోకి మరో ఉపాధ్యాయులు రాకపోవడంతో రెండు నెలల నుంచి రిలీవ్ కాక అక్కడే పనిచేస్తున్నారు. ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. డీఎస్సీ ఫలితాలు ప్రకటించారు. జాప్యం చేయకుండా ఉపాధ్యాయులను నియమించాలి.

–మైలారం సత్తయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉండాల్సిన టీచర్లు, ప్రస్తుతం ఉన్నది

జిల్లాలో ఉన్న 712 ప్రభుత్వ పాఠశాలల్లో 45,548 మంది విద్యార్థులు ఉన్నారు. అందుకు అనుగుణంగా 3,497 మంది ఉపాధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం 2,761 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. రెండు నెలల క్రితం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల అనంతరం, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులతో 736 ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. డీఎస్సీ-2024 ద్వారా 277 ఖాళీల్లో ఉపాధ్యాయులను నియమించనున్నారు. అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరత తప్పే పరిస్థితి లేదు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలి



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, జెడ్పీ సీఈఓ శోభారాణి, అధికారులు

సాక్షి,యాదాద్రి : జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యం, అహింస, స్వచ్ఛత అనే విలువలకు కట్టుబడిన మహనీయుడు మహాత్మాగాంధీ అని పేర్కొన్నారు. దేశ స్వాతంత్య్ర కోసం శాంతియుత పోరాటం చేశారని, ఆయన కలలను సాకారం చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఈఓ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పార్థసింహారెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొదటి రోజు 92 మంది హాజరు

- ప్రారంభమైన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

భువనగిరి : డీఎస్సీ-2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం భువనగిరిలోని వెన్నెల కళాశాలలో ప్రారంభమైంది. ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున పిలిచి వారి సర్టిఫికెట్లును పరిశీలించారు. మంగళవారం రోజునుంచే సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కావాల్సి ఉండగా సమాచారం అందకపోవడంతో అభ్యర్థులు హాజరుకాలేదు. బుధవారం ఎస్టీటీ కేటగిరీకి చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. వీరిలో కూడా చాలా మందికి సమాచారం అందకపోవడంతో తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. 135 పోస్టులకు గాను 405 మంది హాజరు కావల్సి ఉండగా 92 మంది వచ్చారు. స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలకు బుధవారం సాయంత్రం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎస్ఎంఎస్‌లో అడ్రస్ లేక అభ్యర్థుల ఇక్కట్లు

అభ్యర్థుల సెల్‌ఫోన్లకు పంపిన ఎస్ఎంఎస్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరిగే సెంటర్ వివరాలు లేవు. దీంతో అభ్యర్థులు కేంద్రం అడ్రస్ తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పాత డీఈఓ కార్యాలయానికి, మరికొందరు కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయానికి వెళ్లారు. అడ్రస్ తెలియక అయోమయానికి గురయ్యారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



సన్మానం పొందిన పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ తదితరులు

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్ : పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం భువనగిరి మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సంత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సమాజం నిద్రలేవకపోముందే గ్రామాలు, పట్టణాలను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ కార్మికుల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నిధులొస్తేనే పనులు కదిలేది..

- మోడ్రన్ ధోబీ ఘాట్‌కు నిధుల కొరత
- ఏడాది క్రితం నిలిచిపోయిన పనులు
- రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న మోడ్రన్ ధోబీ ఘాట్‌ను నిధుల కొరత వెంటాడుతోంది. ఏడాదిన్నర కావస్తున్నా నిధుల కొరత వల్ల పనులు పూర్తికావడం లేదు. మోత్కూరు పట్టణంలోని బిక్కేరు చెంతన రూ.2కోట్ల వ్యయంతో ధోబీ ఘాట్ పనులను ప్రారంభించారు. 2023 ఏప్రిల్‌లో అప్పటి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు కోటి రూపాయలు విలువ చేసే పనులు పూర్తి చేశారు. సుమారు రూ.50 లక్షలు యంత్రాలకు వినియోగించనున్నారు. నిధుల లేమితో యంత్రాలను సమకూర్చలేకపోతున్నారు. బిల్లులు రాకపోవడంతో దోభీఘాట్ పనులను కాంట్రాక్టర్ అర్ధాంతరంగా నిలిపివేశాడు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే తప్పా.. పనులు కదిలే పరిస్థితి లేదు.



అసంపూర్తిగా ధోబీఘాట్

యంత్రాలు కొనుగోలు చేయాలి

నిధులు రాకపోవడంతో ధోబీఘాట్ పనులు నిలిచిపోయాయి. భవన నిర్మాణం 75 శాతం పూర్తయ్యింది. యంత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–శ్రీకాంత్, మోత్కూరు మున్సిపల్ కమిషనర్

శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళాయె



దేవీశరన్నరాత్రి ఉత్సవాలకు దుర్గామాతను ప్రతిష్ఠించేందుకు రామన్నపేటలోని సిరిపురం శివాజీనగర్‌లో సిద్ధం చేసిన మండపం

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి!

దోతిగూడెం, అంతమ్మగూడెం, చౌటుప్పల్ ప్రాంతవాసుల గగ్గోలు

- కాలుష్య నియంత్రణ మండలికి వెల్లువలా ఫిర్యాదులు
- ఇటీవల తనిఖీలు నిర్వహించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్
- ప్రభుత్వానికి నివేదిక అందజేత
- నేడు సనత్‌నగర్‌లో విచారణ చేయనున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ
- హాజరుకావాలని పలు రసాయన పరిశ్రమల యజమానులకు నోటీసులు

సాక్షి యాదాద్రి : రసాయన కంపెనీలు వెదజల్లుతున్న విష వాయువులతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధానంగా దోతిగూడెం, అంతమ్మగూడెం, చౌటుప్పల్ ప్రాంతాల వాసులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తమ ఆరోగ్యానికి హానికరంగా పరిణమించిన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల భువనగిరి ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సైతం పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ్ భవన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బోర్డు టాస్క్‌ఫోర్స్ కమిటీ కంపెనీలపై విచారణ చేపట్టనుంది. విచారణకు హాజరు కావాలని సంబంధిత పరిశ్రమల యజమానులను ఆదేశించింది. ఎంపీ, ఎమ్మెల్యేలు, రైతులు కూడా హాజరుకానున్నారు.

ఉమ్మడిగా తనిఖీలు

పోచంపల్లి మండలం దోతిగూడెంలో గల అప్టిమస్, వీజే సాయి కెమ్, హెజలో ల్యాబ్‌తో పాటు మరికొన్ని కంపెనీల్లో ఆగస్టు 22న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఉమ్మడ నల్లగొండ పీసీబీ ఈఈతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు.



భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెంలో సాగునీరు కలుషితమై ఎండిపోతున్న వరి చేను



దోతిగూడెంలోని రసాయన పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ (ఫైల్)

రైతులు, స్థానికుల నుంచి భారీగా ఫిర్యాదులు

కంపెనీల్లో తనిఖీలకు వచ్చిన సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేకు రైతులు, స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందజేశారు. కాలుష్యం వల్ల పంటలు పండడం లేదని, పాడి, పౌల్ట్రీపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వ్యర్థాలను బోర్లు, మూసీ నది, కాలువల్లోకి వదులుతుండటంతో భూ గర్భ జలాలు, గాలి, నేల కాలుష్యమై బతుకలేని పరిస్థితి నెలకొందన్నారు. పీసీబీ ఉదాసీనత వైఖరితో కంపెనీలు నిబంధనలు పాటించడంలేదని వాపోయారు.

ప్రజల ప్రాణాలే ముఖ్యం

తమకు ప్రజల ప్రాణాలే ముఖ్యం. రసాయన పరిశ్రమల యాజమాన్యాలు తీరు మార్చుకోవాలి. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. నీరు, గాలి, నేల కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత కంపెనీలపై ఉంది. ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో కంపెనీల్లో తనిఖీలు చేశాం. కంపెనీలు విడుదల చేస్తున్న కాలుష్యంపై పార్లమెంట్‌లో కూడా ప్రస్తావించాను.

–చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

పరిశ్రమల్లో లోపాలను సరిదిద్దుకోవాలి

దోతిగూడెంలో ఓ రసాయన కంపనీ పబ్లిక్ హియరింగ్‌ను ఆపాం. కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని ధర్నాలు చేశాం.తమకు ప్రజల ఆరోగ్యమే ముఖ్యం. కంపెనీలకు వ్యతిరేకం కాదు, కానీ, కాలుష్యం లేకుండా ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా పరిశ్రమల్లో లోపాలను సరిదిద్దుకుని ప్రజారోగ్యానికి హాని కలగకుండా చూడాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదు.

–కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

త్రిపురారం: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిడమనూరు మండలం వేంపాడు గ్రామ పరిధిలో జరిగింది. బుధవారం నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిపాడు గ్రామానికి చెందిన కట్టి బోయిన శివ(30) నిడమనూరు మండలం వేంపాడు గ్రామ పరిధిలో ఉంటూ స్థానికంగా ఓ పామాయిల్ తోటలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శివ గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శివకు తన భార్య ధనమ్మతో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధనమ్మ తన పుటింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన శివ సోమవారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి


వెంకన్న (ఫైల్)

హుజూర్‌నగర్ : ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మలచెరువు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి అవిరబోయిన వెంకన్న (40) బుధవారం తన పొలం వద్ద నుంచి గడ్డి మోపులు ట్రాక్టర్ కల్టివేటర్‌పై వేసుకొని వస్తుండగా.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నూతనకల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున నూతనకల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ బంగ్లా నుంచి నూతనకల్‌కు వస్తున్న బొలేరో వాహనంలో 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ బదావత్ సురేష్‌ను విచారించగా మర్రిపెడ బంగ్లాకు చెందిన బుద్ద శ్రీనివాస్ ఇంటి నుంచి బియ్యాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. బుద్ద శ్రీనివాస్, బదావత్ సురేష్‌పై కేసు నమోదు చేసి పట్టుబడిన రేషన్ బియ్యం, బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి కుంటలో పడి వృద్ధురాలి మృతి


భారతమ్మ (ఫైల్)

రామన్నపేట: నీటి కుంటలో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం రామన్నపేట మండలం నిధానపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిధానపల్లి గ్రామానికి చెందిన గోపగోని భారతమ్మ(70), ఆమె కుమార్తె బత్తిని కళమ్మ ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. బుధవారం కళమ్మ కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం భారతమ్మ కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ శివారులోని కుమ్మరి కుంట వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి మృతిచెందింది. మందడి గోపాల్‌రెడ్డి అనే రైతు కుంటలో మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు

- ముస్తాబైన యాదాద్రి కొండపైన శివాలయం
- గ్రామాలు, పట్టణాల్లో కొలువుదీరనున్న అమ్మవారి విగ్రహాలు


నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం

యాదగిరిగుట్ట: దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలు నెలకొల్పేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. మండపాలు సిద్ధం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. దుర్గామాత మాలధారణ చేయడానికి భక్తులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

విజయానికి సూచికగా..

పూర్వం దుర్గుడు అనే రాక్షసుడు దేవతలను హింసిస్తుంటే, దేవతాలందరూ ఒక్కచోట చేరి శక్తి స్వరూపాన్ని రూపొందించారు. ఇలా ఆవిర్భవించిన శక్తి స్వరూపమే దుర్గామాత అని, దుర్గామాత మహిషాసురుడిని సంహరించినందుకు సూచికగా దసరా పండుగ జరుపుకుంటున్నట్లు పురాణ గాథ. అంతేకాకుండా రాముడు రావణాసురుడిని సంహరించిన అనంతరం ఆ విజయానికి సూచికగా కూడా విజయదశమి జరుపుకుంటున్నట్లు చరిత్ర చెబుతోంది.

శమీ వృక్షానికి పూజలు చేసిన దేవుళ్లు..

పూర్వం రాజులు దండయాత్రలను విజయదశమి రోజు నుంచి ప్రారంభించేవారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ రోజుకు ముందే రాజులు ఆయుధ పూజలు నిర్వహించి విజయదశమి రోజు యుద్ధానికి వెళ్లేవారని పురాణాలు చెబుతున్నాయి. దసరా రోజున 'శమి శమీయతే పాపం.. శమీ శత్రు వినాశనం.. అర్జునస్య ధనుర్ధారి.. రామస్య ప్రియ దర్శనం..' అని శమీ వృక్షానికి పూజలు చేయడం ఆనవాయితీ. అర్జునుడు మారువేశం(పేడి) వదిలి శమీ వృక్షానికి పూజలు నిర్వహించి తిరిగి గాండీవాన్ని చేపట్టాడని, రాముడు రావణుడిని సంహరించి శమీ వృక్షానికి పూజ చేసి తిరిగి అయోధ్యకు పయనమయ్యాడని అందుకే ఈ వృక్షం అత్యంత పవిత్రమైందని శాస్త్రాలు చెబుతున్నాయి.

నైవేద్యం ఇలా..

శరన్నవరాత్రుల్లో భాగంగా తొలిరోజు పులిహోర, రెండో రోజు రవ్వకేసరి, మూడో రోజు గారెలు, నాల్గో రోజు కిచిడీ, ఐదో రోజు పెరుగన్నం, ఆరో రోజు అన్నపాయసం, ఏడో రోజు కొబ్బరన్నం, ఎనిమిదో రోజు వడలు, నిమ్మరసం, తొమ్మిదో రోజు బెల్లం అన్నం, చివరి రోజు పేలాల ఉండలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

యాదాద్రి కొండపై..

యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం 11.45 గంటలకు విఘ్నేశ్వర పూజతో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు పేర్కొన్నారు. 12వ తేదీన శమీ పూజ ఉంటుందన్నారు. తొమ్మిది రోజుల ఉత్సవాల్లో దంపతులు పాల్గొంటే రూ.1,116 చెల్లించాలని, లక్ష కుంకుమార్చన, సప్తపతీ పారాయణములో పాల్గొనాలంటే రూ.116 చొప్పున టికెట్ నిర్ణయించినట్లు ఈఓ పేర్కొన్నారు.

తొమ్మిది రోజులు వివిధ రూపాల్లో..

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా, రెండో రోజు గాయత్రిదేవిగా, మూడో రోజు మహాలక్ష్మి దేవిగా, నాల్గో రోజు అన్నపూర్ణ దేవిగా, ఐదో రోజు లలితాత్రిపుర సుందరి దేవిగా, ఆరో రోజు శ్రీమహా సరస్వతిదేవిగా, ఏడో రోజు దుర్గాదేవిగా, ఎనిమిదో రోజు మహిషాసురమర్ధినిగా, తొమ్మిదో రోజు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనుంది.

మహాత్ముడి మార్గాన్ని అనుసరించాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


గాంధీ గుడిలో పూజలు చేస్తున్న గుత్తా

చిట్యాల: మహాత్మా గాంధీజీ మార్గాన్ని అనుసరించి యువత తమ లక్ష్యాలను సాధించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో గల గాంధీ గుడిలో బుధవారం నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూజలు చేశారు. గుడి నిర్మించిన వారిని ఆయన అభినందించారు. అనంతరం గుడి నిర్వాహకులు సుఖేందర్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో మహాత్మా చారిటబుల్ ట్రస్ట్ చీఫ్ డి. సీత, సలహాదారుడు జోగినేపల్లి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ సర్పంచ్ కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎదుళ్ల అజిత్‌రెడ్డి, నీలకంఠం లింగస్వామి, నీలకంఠం నరేష్ పాల్గొన్నారు.

మహోద్యమంగా బహుజన బతుకమ్మ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విమలక్క, ప్రజా సంఘాల నాయకులు

- ప్రజా గాయకురాలు విమలక్క

భువనగిరి : తాము నిర్వహిస్తున్న బహుజన బతుకమ్మ ఉత్సవాలు మహోద్యమం అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు, ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. బుధవారం భువనగిరిలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ఏడాది బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రస్తుతం ఉన్న చట్టాల కంటే మరింత కఠినంగా ఉండే చట్టాలను తీసుకురావాలన్నారు. పర్యావరణానికి విఘాతం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బహుజన బహుజన బతుకమ్మ ఉత్సవం మొదటి రోజు జనగామ జిల్లా పాలకుర్తిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. బుధవారం నుంచి పది రోజుల పాటు నిర్వహించే బహుజన బతుకమ్మ కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు, ప్రకృతి ప్రేమికులు, సామాజికి ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్ వెంకటనర్సింగ్ నాయక్, పడిగెల ప్రదీప్, నాయకులు రాజేష్ నాయక్, శివలింగం, ఇటుకల దేవేందర్, కుతాడి సురేష్, అశోక్, నర్సింహ, కర్తాల శ్రీనివాస్, బాలరాజ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో అమావాస్య ప్రత్యేక పూజలు


లక్ష పుష్పార్చనలో పాల్గొన్న ఈఓ నవీన్‌కుమార్

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున చెర్వుగట్టుకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని రాత్రి గట్టుపై నిద్ర చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సురేష్‌శర్మ, సతీష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం, వేద పండితులు మహా మండపంలో లక్ష పుష్పార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. గట్టు పైకి వాహనాలను పోలీసులు అనుమతించలేదు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నంది విగ్రహం వద్ద ఘర్షణ..

అయితే గట్టు కింద నంది విగ్రహం వద్ద ఓ కారులో భక్తులు పైకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆలయ సిబ్బంది నిరాకరించారు. దీంతో ఆలయ సిబ్బంది, భక్తుల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతోనే కొందరు తమకు ఇష్టమొచ్చినట్లు తమ వాహనాల్లో పైకి వెళ్తున్నారని భక్తులు ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పెసరమల్లి నరేష్‌బాబు(32) కొన్నేళ్ల నుంచి హుజూర్‌నగర్‌లోని అంబేద్కర్ కాలనీలో నివాసముంటూ కోదాడ పట్టణంలోని మహా సిమెంట్ లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి కోదాడలో విధులు ముగించుకుని రాత్రి బైక్‌పై హుజూర్‌నగర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ పట్టణంలోని మల్లన్ననగర్ కాలనీ వద్ద టిప్పర్ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్‌బాబు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తమ్ముడు పెసరమల్లి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిందు యక్షగాన కళాకారుడు..


చంద్రమౌళి (ఫైల్)

రాజాపేట: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు పిల్లుట్ల చంద్రమౌళి(47) గత నెల 20వ తేదీన జనగామ జిల్లా దేవరుప్పల వద్ద బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- మృతుడు అమీనాబాద్ వాసి


లక్ష్మణ్‌రావు మృతదేహం

నేలకొండపల్లి: సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మృతి చెందాడు. అనంతగిరి మండలంలోని అమీనాబాద్‌కు చెందిన గుండు లక్ష్మణ్‌రావు (32) ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి–కొత్తూరు శివారులో బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించారు. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే లక్ష్మణ్‌రావు బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తెలిసింది. అయితే బైక్‌పై నుంచి కింద పడి మృతి చెంది ఉంటాడనే భావనతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారం మేరకు లక్ష్మణ్ రావు మృతదేహాన్ని పరి శీలించిన కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కొడుకు ఒంటిపై కాలిన గాయాలు ఉన్నాయని, అతడిని ఎవరో కొట్టి చంపారని మృతుడి తల్లి హైమావతి ఆరోపించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు నేలకొండపల్లి ఎస్సై సంతోష్ తెలిపారు.

గానుగ నూనె అందజేత


మిర్చి బండి నిర్వాహకులకు గానుగ నూనె అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చండూరు: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో మిర్చి బండి నిర్వాహకులకు కాంగ్రెస్ నాయకులు గానుగ నూనె అందజేశారు. ఎమ్మెల్యే ఇటీవల చండూరు పట్టణంలో పర్యటించి మిర్చి బండిల నిర్వాహకులు వాడే నూనెను పరిశీలించారు. కల్తీ నూనె వలన ఆరోగ్యం చెడిపోతుందని, ప్రతి మిర్చి బండి నిర్వాహకుడు గానుగ నూనె వాడాలని సూచించారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు గానుగ నూనె అందజేశారు. కార్యక్రమంలో చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు దోటి వెంకటేష్, సుజాతయాదవ్, కోడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఆలయ భూములు కాపాడాలని గాంధీ చిత్రపటానికి వినతి


గాంధీ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ, గ్రామస్తులు

మునగాల: మండల పరిధిలోని నర్సింహాపురంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయ భూములను ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని బుధవారం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమ కారుడు వేమూరి సత్యనారాయణ గ్రామస్తులతో కలిసి గాంధీ చిత్రపటానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చెరవుపల్లి లింగయ్య, కన్నెబోయిన విజయ్, వీరబోయిన వీరస్వామి, వీరబోయన నాగరాజు, కిన్నెర శ్రీను, తోకల వీరబాబు, వీరబోయిన గుర్వయ్య, మీసాల విజయ్, సుధీర్, పవన్, కిన్నెర కోటేష్, మిర్యాల వెంకట్, మొండి తోక విజయ్ పాల్గొన్నారు.

నేపాల్‌లో బతుకమ్మ వేడుకలు


మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లికి చెందిన మహిళలు బుధవారం నేపాల్ దేశ రాజధాని ఖాట్మండులోని గృహేశ్వరి శక్తి పీఠంలో ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. కొన్నేళ్లుగా అక్కడే స్థిరపడిన యాద్గార్‌పల్లి మహిళలు మన రాష్ట్ర పండుగ బతుకమ్మ ఘనంగా జరుపుకోవడంతో అక్కడి ప్రజలు ఆసక్తిగా తిలకించారు. – మిర్యాలగూడ

'ఏడు కోలలబాయి' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ వార్డు సభ్యురాలు భాగ్య, పుస్తక రచయిత నరసింహారెడ్డి తదితరులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తికి చెందిన ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'ఏడు కోలలబాయి' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం గ్రామంలో సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు సిరిపంగి భాగ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనలాంటి సామాన్యురాలితో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డికి అంకితం చేసిన పుస్తకాన్ని ఆవిష్కరింపజేయడం ఆనందంగా ఉందన్నారు. సృజన సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య మాట్లాడుతూ.. భారత ఎన్నికల వ్యవస్థలోని లోసుగులను, రాజకీయాల్లో ప్రవేశించిన అవినీతిని, ప్రస్తుత రాజకీయాల తీరును ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకతను ఈ పుస్తకంలో రచయిత వివరించారన్నారు. అనంతరం గ్రామంలోని నర్రా రాఘవరెడ్డి వారసులకు ఆ పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో నర్రా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నర్రా సుఖేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, కవులు, రచయితలు కాసుల అంజనేయులు, సిలివేరు నరసింహ, మోత్కూరు శ్రీనివాస్, నిమ్మల భీమార్జున్‌రెడ్డి, సాగర్ల నరేష్, జిట్ట నగేష్, శీల రాజయ్య, సిరిపంగి గోపాల్, మేడి హరిక్రిష్ణ, బూరుగు గోపి, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణయ్య, రామక్రిష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

సూక్ష్మ పోషక లోపాలు నివారిస్తే అధిక దిగుబడి



పాడిపంట

పెద్దవూర: పంటల పెరుగుదలకు ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు ఎంతో అవసరం. సూక్ష్మ పోషకాల లోపాల వలన నేలలు చౌడుగా మారి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. తద్వారా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు ఎప్పటికప్పుడు పొలంలో సూక్ష్మ పోషకాలను గుర్తించి నేలలో సాధ్యమైనంత మేర ఎరువులు వేసుకుని పంటలపై వాటి ప్రభావం ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా సూక్ష్మ పోషకాలలో జింకు లోపమనేది సాధారణమైతే బోరాన్ లోపాలు అక్కడక్కడ కనిపిస్తాయి. జింకు లోపమనేది సాధారణంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలలో ఎక్కువగా కనిపిస్తుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాల లోపాలు, నివారణ చర్యలు ఆయన మాటల్లోనే..

ఇనుము లోపం..

జింకు తరువాత ఇనుము లోపం ప్రధానమైనది. ఈ లోపం అక్కడక్కడా మట్టి నమూనాల్లో గమనిస్తాము. ఇనుము లోపం సున్నం అధికంగా ఉండే నేలల్లో లేదా సాగునీటిలో కార్బోనేట్లు, బైకార్బోనేట్లు అధికంగా ఉండే సందర్భాలలో కనిపిస్తుంది. ఇనుము లోపం వరిలో మెట్ట నారు మడుల్లో, నీటి ఎద్దడి ఉన్నప్పుడు ఆకుల ఈనెల మధ్య భాగం పత్రహరితాన్ని కోల్పోయి పసుపుగా మారుతుంది. లోపం తీవ్రమయ్యే కొద్దీ ఆకు క్రమంగా పాలిపోయి తెల్లగా మారి ఎండిపోతాయి. ఇతర పంటల్లో కూడా ఇదే విధమైన లక్షణాలు ప్రధానంగా లేత ఆకుల్లో కనిపించి మొక్క పెరుగుదల కుంటుపడుతుంది.

నివారణ ఇలా..

ఇనుము లోపం గ్రహించినప్పుడు లీటరు నీటికి 10 గ్రాముల అన్నభేదిని ఒక గ్రాము నిమ్మ ఉప్పుతో కలిపి మొక్క మొత్తం తడిసే విధంగా వారం, పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయడం ద్వారా లోపాన్ని నివారించవచ్చు.

బోరాన్ లోపం..

వరిలో బోరాన్ లోపం వల్ల లేత ఆకులు వంకర్లు తిరిగి ఆకులు ఎండిపోతాయి. నేలల్లో బోరాన్ ఎక్కువైనప్పుడు ఆకులపై చివరన మచ్చలు వచ్చి ఎండిపోతాయి. నేలల్లో బోరాన్ లోపస్థాయి లేదా విషమస్థాయి మధ్య వ్యత్యాసం తక్కువ కావున బోరాన్ లోపం నిర్ధారించిన తర్వాత మాత్రమే నేలలకు లేదా పంటకు బోరాన్‌ను అందించాలి. పత్తి పండించే నేలల్లో కూడా బోరాన్ లోపం కనిపిస్తుంది. పొద్దు తిరుగుడు, వేరుశనగ పంటల్లో బోరాన్ లోపం అనేది సర్వ సాధారణం.

నివారణ ఇలా..

బోరాన్ లోపం నివారణకు ఎకరాకు 2 కిలోల బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేయటంతో పాటు రెండుసార్లు 0.15 శాతం బోరాక్స్‌ను 60 లేదా 90 రోజులకు పిచికారీ చేయాలి. పొద్దుతిరుగుడు పూలల్లో మధ్య భాగం గింజ కట్టదు. వేరుశనగలో గింజ మధ్యభాగం తోడుకోదు. ఈ లోపాన్ని సవరించటానికి 0.1 శాతం బోరిక్ ఆమ్లాన్ని ఒక లీటరు నీటికి కలిపి పైరు వేసిన 30–45 రోజుల తరువాత రెండుసార్లు పిచికారీ చేయాలి.

జింకు లోపం

జింకు లోపమనేది సాధారణంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాల(అపరాలు)లో కనిపిస్తుంది. వరిలో జింకు లోపం మెరక తీసిన పొలాల్లో, చివకని లేదా మాగని సేంద్రీయ పదార్థం వేసిన నేలల్లో, చౌడు ఉప్పు నేలల్లో, భాస్వరం ఎరువు ఎక్కువ మోతాదులో వేసిన పొలాల్లో కనిపిస్తుంది. జింకు లోపం ద్వారా వరిలో నాటిన 2 నుంచి 4 వారాల్లో మొక్కపై నుంచి 3 లేదా 4వ ఆకు నడుమ ఈనె తెల్లగా పాలిపోతుంది. ఆ తర్వాత ఆకు కొనభాగం ఆకుపచ్చ రంగులోనే ఉండి ఆకు మధ్య భాగంలో ముదురు ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. కొన్నిసార్లు ఏవిధమైన లోప లక్షణాలు కనిపించకుండా నత్రజని, భాస్వరం ఎరువులు తగినంతగా వేసినప్పటికీ పైరు ఏపుగా పెరగదు. మొక్కజొన్నలో జింకు లోపం వల్ల లేత ఆకుల్లో నడుమ ఈనెకు సమాంతరంగా తెలుపు లేదా పసుపు చారలు ఏర్పడి, మొక్క గిడసబారి ఉంటుంది. లోపం తీవ్రత ఎక్కువైనప్పుడు ఆకులు ఎరుపు రంగులోకి మారి ఆకుపై మచ్చలు ఏర్పడతాయి. అపరాలలో జింకు లోపం వలన మొక్కలు గిడసబారిపోయి లేత ఆకుపచ్చ మచ్చలు వచ్చి ఆకులు చిన్నవిగా మారి కణుపులు దగ్గరగా ఉండి మొక్క గుబురుగా ఆలస్యంగా పెరుగుతుంది.

నివారణ చర్యలు

సాధారణ నేలల్లో మూడు పంటలకు ఒకసారి, కొత్త ఆయకట్టు కింద సాగు చేసే నేలల్లో, చౌడు, ఉప్పు నేలల్లో రెండు పంటలకు ఒకసారి ఎకరాకు 20కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరు మీద జింకు లోపం గమనిస్తే లీటరు నీటికి 2గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ కలిపి ఆకులు మొత్తం తడిసేలా ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని 2–3 సార్లు 5 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. వరి తరువాత వరి పండించే నేలల్లో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ప్రతి పంటకు ముందు వేసి జింకు లోపాన్ని నివారించవచ్చు.

సేంద్రియ ఎరువుల వాడకం

రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపడం వల్ల భూమిలో సూక్ష్మ పోషకాల లోపాన్ని అరికట్టడానికి ఆస్కారం ఉంటుంది. నేలలోనే కాకుండా పంటపై కూడా లోపాలను సరిచేసుకోవచ్చు. రసాయన ఎరువులు మితిమీరి వాడటం వలన భూమిలో సారం తగ్గి పోతుందనేది రైతులు గమనించాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువుల వాడకం వలన పంటకే కాకుండా పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. అంతేకాకుండా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించటానికి దోహదం చేస్తుంది.